క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల కల్పవల్లి కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

35వ వార్డులో అన్నదానం



ప్రసాద్‌గార్డెన్స్‌లో అన్నప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కనకరెడ్డి

జగదాంబ: శ్రీరామనవమిని పురస్కరించుకుని జీవీఎంసీ 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్‌లో సోమవారం అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు అలపన కనకరెడ్డి కార్యక్రమంలో పాల్గొని, అన్నప్రసాదం వడ్డించారు. కనకరెడ్డి మాట్లాడుతూ ఏటా సీతారామ షిర్డీబాబా సేవా సంఘం అన్నదానం నిర్వహించి, పేదల కడుపు నింపుతున్నారన్నారు. సంఘం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

కిలో మంచి ముత్యాలు అందజేత



ఈవో సుబ్బారావుకు మంచి ముత్యాలు అందజేస్తున్న బోకం శ్రీనివాస్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరానికి చెందిన బోకం శ్రీనివాస్ కిలో మంచి ముత్యాలను ఈవో కె.సుబ్బారావుకు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, సూపరింటెండెంట్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

గణేష్‌బాబుకు ఉగాది పురస్కారం



గణేష్‌బాబుకు పురస్కారం అందజేస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్: సామాజిక సేవా విభాగంలో నగరానికి చెందిన కొండపి వెంకట గణేష్‌బాబుకు ఉగాది పురస్కారం లభించింది. మూడు దశాబ్దాలుగా తన సొంత నిధులతో చేస్తున్న నిస్వార్థ సేవలను గుర్తించి విపంచి ఫౌండేషన్(తెలంగాణ) సోమవారం హైదరాబాద్ రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఈ పురస్కారాన్ని అందించింది. సంస్థ చైర్మన్ అనుముల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవి, విమర్శకుడు, ఎస్‌డీసీ డాక్టర్ నరసింహారెడ్డి, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాల చొదరి తదితర ప్రముఖుల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు.

రైల్వేస్టేషన్‌లో 3 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 3 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. విశాఖ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్‌కే అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఎల్‌ఎస్‌ఐ పి.ఆర్.బిషోయి వారి సిబ్బందితో కలిసి విశాఖ రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో సోమవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఏపీకి చెందిన తనాకి శాలింరాజ్ విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా కృష్ణా జిల్లా విజయవాడకు గంజాయి రవాణా చేయడాన్ని ఆర్పీఎఫ్ ఎస్‌ఐ బిషోయి గుర్తించి, జీఆర్పీ ఎస్‌ఐ అబ్దుల్‌కు అప్పగించారు. రూ.15 వేల విలువైన 3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

సాహితీ సౌరభం విజ్ఞాన నిలయం

ఆరు దశాబ్దాలుగా పాఠకుల విశేషాదరణ పొందుతూ విజ్ఞాన పరిమళాలను వెదజల్లుతోంది ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం. ద్వారకానగర్ దరి నెహ్రూ బజార్ ప్రాంతంలో 1965లో ఏర్పాటైన ఈ పుస్తకాలయం ఎంతోమంది విద్యార్థుల, నిరుద్యోగుల జ్ఞానతృష్ణను తీరుస్తుంది. పుస్తకప్రియులకు చక్కని వేదికగా నిలుస్తోంది.

పాఠకులతో ఆరు దశాబ్దాల అనుబంధం

విద్యార్థులకు విజ్ఞాన సర్వస్వం

ఆదరణ పొందుతున్న ప్రాంతీయ గ్రంథాలయం

నిరుద్యోగుల మినీ ప్రపంచం



గ్రంథాలయంలో పాఠకులు



గ్రంథాలయంలో వార్తాపత్రికలు చదువుతున్న పాఠకులు

సీతమ్మధార: నగరంలోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం సాహితీ సౌరభాలను వెదజల్లుతోంది. నగరంలో ప్రభుత్వ గ్రంథాలయమే లేని తరుణంలో 1965లో ఈ గ్రంథాలయం ఏర్పాటైంది. రాష్ట్రంలో నాలుగే ప్రాంతీయ గ్రంథాలయాలు ఉండగా, అందులో ఒకటి విశాఖ కావడం విశేషం. ద్వారకానగర్ దరి నెహ్రూ బజార్ ప్రాంతంలో ఏర్పాటైన ఈ గ్రంథాలయం 60 సంవత్సరాలుగా పాఠకులకు సేవలు అందిస్తోంది. ప్రస్తుతం ఇక్కడ 53,460 వరకు పుస్తకాలు కొలువుదీరి ఉన్నాయి. ఇటీవలే కొందరు దాతలు 1700 వరకు కొత్త పుస్తకాలు ఇచ్చారు. దిన పత్రికలతో పాటు ఆర్‌ఆర్‌బీ, గ్రూప్ పరీక్షలు, డీఎస్సీ, రైల్వే, తదితర పోటీపరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇక పుస్తక ప్రియుల కోసం 8వేల వరకు నవల్స్ కూడా ఉన్నాయి. రోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు గ్రంథాలయం పనిచేస్తుంది.



గ్రంథాలయంలో కొలువుదీరిన పుస్తకాలు

సిబ్బందిని భర్తీ చేస్తే..

ఇక్కడి గ్రంథాలయంలో మొత్తం 8 మందికి గాను, ప్రస్తుతం నలుగురే సిబ్బంది ఉన్నారు. ఒక లైబ్రేరియన్, అసిస్టెంట్ లైబ్రేరియన్, రికార్డు అసిస్టెంట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. టైపిస్టు, వాచ్‌మన్, గ్రేడ్–2, గ్రేడ్ –3 లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం ఇక్కడి పోస్టులను భర్తీ చేసి, నిధులు పెంచితే గ్రంథాలయం మరింతగా అభివృద్ధి చెందుతుందని పాఠకులు కోరుతున్నారు.



నెహ్రూ బజార్ వద్ద గల ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం

సభ్యత్వం ఇలా..

గ్రంథాలయంలో సభ్యత్వం కావాలంటే రూ.150 చెల్లించాలి. ప్రస్తుతం గ్రంథాలయ పరిధిలో 730 మంది వరకు సభ్యులు ఉన్నారు. ఇక్కడ రోజూ సగటున 80 మంది వరకు పాఠకులు వస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు అధికసంఖ్యలో ఇక్కడికొచ్చి పలు పోటీ పరీక్షల పుస్తకాలు చదువుతుంటారు.

పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా

ఈ గ్రంథాలయం చదువుకునేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. చాలా పోటీపరీక్షల పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు ఉచితంగా పోటీ పరీక్షల పుస్తకాలు చదువుకునే అవకాశం ఉంది. ప్రశాంతంగా ఉంటుంది. అందుకే ఖాళీ సమయాల్లో ఇక్కడికే వచ్చి చదువుకుంటూ ఉంటాను.

– ఫణీంద్ర, విద్యార్థి, నెహ్రూబజార్.

దినపత్రికల కోసం వస్తున్నా ..

పోటీపరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు కరెంట్ అఫైర్స్ మీద పట్టు ఎంతో అవసరం. దీంతో ఇక్కడ దిన పత్రికలు చదివేందుకు రోజూ ఈ గ్రంథాలయానికి వస్తాను. జనరల్ నాలెడ్జ్ బుక్స్ కూడా ఉన్నాయి. ఇవి మాకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

– రాజు, విద్యార్థి, ద్వారకానగర్

అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి



ప్రతి ఒక్కరికీ పుస్తకపఠనం ఎంతో అవసరం. సాంకేతికత పెరిగి అరచేతిలోనే అన్నీ అమరిపోతున్నా.. అవి పుస్తకాలకు సాటి రావు. పిల్లలు చిన్నప్పటి నుంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఎంతో విజ్ఞానం సొంతమవుతుంది. మా గ్రంథాలయంలో చాలా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. దాతలు కూడా విరివిగా పుస్తకాలు విరాళంగా ఇస్తున్నారు. వీటిని నిరుద్యోగులు, విద్యార్థులు వినియోగించుకోవాలి.

– బి.ఎ.పద్మావతి, లైబ్రేరియన్

ఉన్నతాధికారి దృష్టికి ఉద్యోగుల సమస్యలు



నూకరాజుతో గిరిజన సంక్షేమ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

డాబాగార్డెన్స్: అఖిల భారత గిరిజన సంక్షేమ ఉద్యోగుల సంఘం విశాఖ జిల్లా కమిటీ సోమవారం సాయంత్రం డాబాగార్డెన్స్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులతో వాణిజ్య పన్నుల కార్యాలయం వద్ద సమావేశమైంది. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రమోషన్లలో రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్‌కు సంబంధించిన అంశంతో పాటు బదిలీలకు సంబంధించి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత శాఖకు చెందిన అసిస్టెంట్ కమిషనర్ డి.నూకరాజు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై అసిస్టెంట్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని సంఘం అధ్యక్షుడు అప్పలరాజు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.బాలగంగాధర్‌తిలక్, కోశాధికారి ఎస్.శోభన్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

భూముల కబ్జాపై సమగ్ర విచారణకు వినతి

అల్లిపురం: విశాఖ రూరల్ మండలం, మధురవాడ, మిథిలాపురి వుడా కాలనీ వీఎంఆర్‌డీఏ సర్వే నం.285లో 800 చ.గజాలు, సర్వే నంబర్ 272లో 1400 చ.గజాల ఖాళీ స్థలాలను సంస్థ ఉద్యోగుల సహాయంతో నకిలీ పత్రాలు సృష్టించి విక్రయిస్తున్నారని, ఇందులో వీఎంఆర్‌డీఏ ఉద్యోగుల పాత్రపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ, విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు కోరారు. దీనిపై వీఎంఆర్‌డీఏ చైర్మన్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఎంవీపీ కాలనీలో 300 చదరపు గజాలు, గాజువాక, కూర్మన్నపాలెం, మర్రిపాలెం, దువ్వాడ, మధురవాడ ప్రాంతాల్లో అనేక విలువైన సంస్థ ఆస్తులు కబ్జాలకు గురవుతున్నాయని వస్తున్న వార్తలపై సమగ్ర విచారణ జరిపించి, వాటిని కాపాడాలని కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా వైద్యా ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. రేసపువానిపాలెంలో మొదలైన ర్యాలీ సత్యం కూడలి మీదుగా తిరిగి రేసపువానిపాలెం వరకు సాగింది. డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు మాట్లాడుతూ మంచి అలవాట్లతో ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. సాధ్యమైనంతవరకు మంచి నీరు తాగడం, ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించడం, బలమైన ఆహారం భుజించడం, చక్కని గాలి, వెలుతురు ఉన్న ప్రదేశంలో నివసించడం వంటివి చేయాలన్నారు. తల్లీ, బిడ్డల ఆరోగ్య విషయంలో మరింత జాగ్రత్త వహించాలని సూచించారు. ర్యాలీలో జిల్లా ప్రోగ్రాం అధికారులు, నర్సింగ్ విద్యార్థినులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణపై అవగాహన అవసరం



జ్యోతిని వెలిగిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్


మహారాణిపేట: తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణపై అవగాహన అవసరమని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కేజీహెచ్ పిల్లల వార్డులో పిల్లల విభాగాధిపతి డాక్టర్ బీఎస్ చక్రవర్తి ఆధ్వర్యంలో తల్లీపిల్లల ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలను మరిన్ని చేపట్టి, ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు జి.రత్నకుమారి, ఎం.చౌదరిబాబు, కె.సత్యకుమారి, సందీప్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు, ఫ్యాకల్టీ వినూత్న కార్యక్రమాలు చేపట్టారు.

కార్మికులకు బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

డాబాగార్డెన్స్: లిటిల్ ఏంజెల్ స్కూల్ యాజమాన్యం కార్మికులకు బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రైవేట్ కాలేజెస్ అండ్ స్కూల్స్ స్టాఫ్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.రాజు డిమాండ్ చేశారు. సోమవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ లిటిల్ ఏంజెల్స్ స్కూల్ యాజమాన్యం ఏళ్ల తరబడి కార్మికులచే చాకిరీ చేయించుకోవడమే తప్పా, చట్ట ప్రకారం కార్మికులకు రావల్సిన గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించడం లేదన్నారు. కార్మికులు క్రమశిక్షణగా అంకిత భావంతో పనిచేయాలని యాజమాన్యం నీతులు చెబుతోందని, కానీ చట్టాలను తుంగలో తొక్కి కార్మికులకు రావల్సిన బకాయిలు చెల్లించడం లేదన్నారు. లేబర్ కమిషనర్ ఆదేశాలు వెంటనే పాటించాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కేఎస్ రావు, పి.రామారావు, గోవింద్, నాగరాజు, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



భగభగ..మండే



వేసవి ఆరంభం నుంచే ప్రజలను ఠారెత్తిస్తోంది. రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతకు మనుషులతో పాటు మూగ జీవాలు అల్లాడిపోతున్నాయి. వృక్షాలు వాడిపోతున్నాయి. ఆకులు రాలి నీటి చుక్కకోసం ఎదురు చూస్తున్నట్లుగా ఉన్నాయి. నగరవాసులు భానుడి భగభగల నుంచి పెంపుడు జంతువులను ఎంతో జాగ్రత్తగా సంరక్షిస్తున్నారు.

– ఫోటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్

తెలుగు మహాసభల లోగో ఆవిష్కరణ

విశాఖ స్పోర్ట్స్: 3వ ప్రపంచ తెలుగు మహాసభల లోగోను శాసనసభ స్పీకర్ చింతకాయల అయన్నపాత్రుడు సోమవారం ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగు భాష, యాస భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రమేవ జయతే అంటూ నినదిస్తున్నామన్నారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న పి.రామచంద్రరాజు మాట్లాడుతూ 2026 జనవరి 3, 4, 5 తేదీల్లో అమరావతి గుంటూరు హైవే శ్రీ సత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ గ్రౌండ్స్‌లో జరిగే ఈ సభ జరుగుతుందన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వై.రామారావు మాట్లాడుతూ గతేడాది ఆరు బ్లడ్‌బ్యాంక్‌ల ద్వారా తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఉచితంగానే రక్తం అందించామన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేయడంటూ ప్రచార రెడ్‌క్రాస్ సొసైటీ గోడపత్రికను స్పీకర్ అయ్యన్నపాత్రుడు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ యువ వలంటీర్లు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేయండి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ వేయాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్ జీవీఎంసీ వెటర్నరీ వైద్యులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల తన చాంబర్‌లో జీవీఎంసీ సిటీ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ ఎస్. కిషోర్‌తో పాటు వివిధ జోన్ల వెటర్నరీ వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్‌కుమార్ మాట్లాడుతూ గుంటూరులో వీధి కుక్కల దాడిలో బాలుడు మరణించాడని, ఇటువంటి సంఘటనలు జరగకుండా జీవీఎంసీ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలని, మంగళవారం నుంచే ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

మెంటల్ హెల్త్ రివ్యూ బోర్డ్ చైర్‌పర్సన్ పోస్ట్‌కు దరఖాస్తులు

బీచ్‌రోడ్డు: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ మెంటల్ హెల్త్ రివ్యూ బోర్డ్ చైర్‌పర్సన్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మానసిక వైద్య శాల సూపరింటెండెంట్ కె.రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, దరఖాస్తులను https// visakhapatnam.nic.in వెబ్‌సైట్‌లో పొందపరిచామని పేర్కొన్నారు. అర్హత గల వారు ఈ నెల 16వ తేదీలోపు పెదవాల్తేరులోని మానసిక ఆస్పత్రి కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

మూగజీవాల దాహార్తి తీర్చండి

జీవీఎంసీ అదనపు కమిషనర్ సోమన్నారాయణ



జంతు ప్రేమికులకు గుర్తింపు కార్డులు, నీటితొట్టెలు అందజేస్తున్న అదనపు కమిషనర్ సోమన్నారాయణ

డాబాగార్డెన్స్: వేసవిలో మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ పిలుపునిచ్చారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో యానిమల్ వెల్ఫేర్ యాక్టివిటీకి చెందిన జంతు ప్రేమికులకు జీవీఎంసీ తరపున గుర్తింపు కార్డులు అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు పలు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, అలాగే మూగ జీవాలైన పశువులు, కుక్కలు, పక్షులు వంటి వాటికి దాహార్తి తీర్చేందుకు జీవీఎంసీ కృషి చేస్తుందని, అందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. యానిమల్ వెల్ఫేర్ యాక్టివిటీ సభ్యులు నగరంలో 300 ప్రాంతాల్లో జంతువులు, పక్షులు, కుక్కలకు నీటి తొట్లతో పాటు ఆహారం స్వచ్ఛందంగా అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ ఎస్.కిషోర్, స్థాయీ సంఘం సభ్యుడు శరగడం రాజశేఖర్, కార్పొరేటర్ రాపర్తి కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు 2,235 దరఖాస్తులు


నేడు, రేపు ఇంటర్వ్యూలు



జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: వివిధ కార్పొరేషన్లు అందించే రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 8, 9 తేదీల్లో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జోన్–4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జోన్–4 పరిధిలో ఉన్న 12 వార్డుల్లో 2235 మంది బీసీ, కాపు, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈబీసీ కార్పొరేషన్లకు సంబంధించి నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పథకాల కింద బ్యాంక్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. 8వ తేదీన 28 నుంచి 33 వార్డులకు సంబంధించి, 9వ తేదీన 34 నుంచి 39 వార్డుల పరిధిలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలియజేశారు. సూర్యాబాగ్‌లోని జోనల్ కార్యాలయంలో కార్పొరేషన్ల అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో పెట్టుకున్న దరఖాస్తుతో పాటు మూడు సెట్లు ధ్రువ పత్రాల జిరాక్స్ కాపీలతో హాజరవ్వాలని సూచించారు.

ప్రజారోగ్య డిమాండ్లపై సంతకాల సేకరణ



బ్యానర్‌పై సంతకం చేస్తున్న కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి

మహారాణిపేట: ప్రజా ఆరోగ్య డిమాండ్లపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పలు ప్రజా సంఘాలు చేపట్టాయి. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కేజీహెచ్ ఓపీ గేటు వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్‌పై పలువురు సంతకాలు చేశారు. ప్రజా ఆరోగ్య వేదిక (పీఏవీ), ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ (పీపీసీ), జన విజ్ఞాన వేదిక(జేవీవీ) సంయుక్తంగా సంతకాల సేకరణ చేపట్టాయి. కేజీహెచ్ చిల్డ్రన్స్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, రిటైర్డ్ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.రామారావు, గైనిక్ రిటైర్డు హెచ్‌వోడీ డాక్టర్ నరసింహారావు, పీఏవీ నుంచి టి.కామేశ్వరరావు, ఐ.శేషు కుమార్, జన విజ్ఞాన వేదిక నుంచి ఎంవీఆర్‌ఎస్ శ్రీకాంత్, చంద్రమౌళి, కళాధర్, సీఐటీయూ నుంచి వై.రాజు, కె.సంతోష్ తదితరులు సంతకాలు చేశారు. ఆరోగ్య డిమాండ్స్ బ్యానర్‌పై పలువురు తమ సంతకాలు చేసి మద్దతు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల 900 రకాల మందులపై పెంచిన ధరల నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, అలాగే వైద్యం, వైద్య ఉత్పత్తులపై జీఎస్టీని జీరో శాతానికి తగ్గించాలని, మందులపై ఉన్న జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని, ఏపీ ఇన్సూరెన్స్ పథకం (ఏపీఐ) తక్షణమే అమలు చేసి ప్రజలకు ఉచిత మందులను అందించాలని పీఏవీ కార్యదర్శి ఐ.శేషుకుమార్ కోరారు.

లలితా పీఠంలో పుష్పయాగం



పుష్పయాగం చేస్తున్న అర్చకులు

సీతంపేట: వసంత నవరాత్రుల్లో భాగంగా సోమవారం లలితానగర్ శ్రీలలితా పీఠంలో సీతారాములకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, చక్రస్నానం, మహా పూర్ణాహుతి జరిపారు. అనంతరం స్వామి వారికి అర్చన, ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, 12 రకాల ఫల నివేదన సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు పుష్పయాగం, చతుర్వేద పారాయణ, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. పీఠంలో ఏర్పాటు చేసిన కర్ణాటక గాత్ర కచేరి అలరించింది. మూనూరు శ్రీకాంత్ అన్నమయ్య, త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. కె.శ్రీరామ్ శ్రీనివాస్ వయోలిన్‌పై, టి.ఎస్.చైతన్య మృదంగంపై సహకారం అందించారు. సీతంపేట పార్వతీశ్వరాలయంలో వేదమంత్రాల నడుమ శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు.